క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి అభినందన

కాట్రేనికోన: జాతీయ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలలో కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపిక కావడంలో సైన్సు ఉపాధ్యాయుడు లంకే హేమ శ్రీనివాస్ కృషి అభినందనీయమని సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో హెచ్ఎం ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన అభినందన సభ జరిగింది. సైన్స్‌ఫెయిర్ 2023లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులను సన్మానించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ అందించిన హేమశ్రీనివాస్‌ను పాఠశాల కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో నల్లా నరసింహమూర్తి, గిడ్ల శ్రీనివాస్, అయితాబత్తుల శ్రీను, నందిక శ్రీను తదితరులు ఉన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిత్యాశ్రీరామ్, రోటరీ ప్రతినిధులు

తాళ్లరేవు: పైడా విద్యా సంస్థలు, రోటరీ క్లబ్ కాకినాడ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 78 మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ నిత్యా శ్రీరామ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా నిత్య అన్నదానం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం సంతృప్తిగా ఉందన్నారు. కళాశాల డీన్ వీరభద్రరావు, డీడీ రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ సూర్యప్రకాష్, కేశవరావు, ఎస్వీఎన్ సురేష్‌కుమార్, రోటరీ ప్రతినిధులు ఎస్ఆర్‌కేఎస్ చౌదరి, వైఎస్ ప్రెసిడెంట్ టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గాయపడిన గేదెకు సేవలు

ముమ్మిడివరం: అగ్ని ప్రమాదంలో గాయపడిన గేదెకు వైఎస్సార్ సంచార పశు వైద్యశాల వైద్యులు సకాలంలో వైద్య సేవలందించారు. అయినాపురం గ్రామానికి చెందిన మట్టా శ్రీనివాస్ పశువుల శాల శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదానికి గురైంది. ఇందులో ఉన్న పశువులను ప్రమాదం నుంచి కాపాడినప్పటికీ ఒక గేదె అందులో చిక్కుకుని తీవ్ర గాయాల పాలైంది. దీంతో రైతు శ్రీనివాస్ 1962కు ఫోన్ చేయగా సకాలంలో వైఎస్సార్ సంచార పశు వైద్యశాల అంబులెన్స్ అక్కడకు చేరుకుంది. తీవ్రంగా గాయపడిన గేదెకు పశు వైద్యులు సీహెచ్ పద్మజ, ప్యారా వెట్ కె.మేఘన, డ్రైవర్ సురేష్ వైద్య సేవలు అందించారు.

తారాజువ్వతో రేగిన మంటలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన స్వామివారి కల్యాణోత్సవం సమీపంలో చిన్న అపశ్రుతి చోటుచేసుకుంది. కల్యాణం సందర్భంగా బాణసంచా కాల్చుతున్న సమయంలో ఓ తారా జువ్వ ఆలయం బయట రోడ్డు చెంత ఉన్న రాజరాజేశ్వరి కల్యాణ మండపం వద్ద వేసిన షామియానాపై పడింది. దీనివల్ల మంటలు చెలరేగాయి. ఆ మంటలను తక్షణమే భక్తులు అదుపు చేయడంలో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

నూతన కార్యవర్గానికి సత్కారం

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎండీయూడబ్ల్యూఏ) నూతన అధ్యక్షుడు పెయ్యల రమేష్, ప్రధాన కార్యదర్శి తాడి షణ్ముఖరాజు, కార్యవర్గ సభ్యులను ఎంపీపీ రాయుడు సునీత అభినందించారు. ఈ కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎంపీపీ రాయుడు సునీతను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వారిని ఎంపీపీ సత్కరించారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, నాయకులు రాయుడు గంగాధర్, వాకపల్లి చిరంజీవి, కోరుకొండ చంటి, చెల్లి యేసుదాసు, మోకా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై అవగాహనకు పుస్తకాలు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు పూర్తి స్థాయిలో తెలిపేందుకు ముద్రించిన పుస్తకాలను ఎంపీడీఓ కె.ఎస్.గౌరీకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించి సచివాలయ ఆరోగ్య మిత్ర సిబ్బందికి అందించారు. వైద్యాధికారి ఎల్.నాగార్జున, చీకట్ల వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి అకడమిక్ తరగతులు

యానాం: కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ (ఆర్ఆర్‌యూ) ఆధ్వర్యంలో రీజినల్ క్యాంపెస్‌ను పుదుచ్చేరిలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వివిధ భద్రతాదళాలకు అక్కడ వివిధ అంశాలపై జూన్ 1 నుంచి అకడమిక్ తరగతులు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆర్ఆర్‌యూ ఓ ప్రకటనలో తెలిపింది. జాతీయ సెక్యూరిటీ, పోలీస్ దళాలు, ఆర్మ్‌డ్ పోలీసులు, సెంట్రల్ పోలీస్ సంస్థల దళాలకు అంతర్జాతీయ స్థాయిలో వృత్తి నైపుణ్యాలపై అకడమిక్ తరగతులు నిర్వహించనున్నారు.



బొడ్డువానిలంక- పాతకోరంగి రహదారికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు

బొడ్డువానిలంక రహదారికి మోక్షం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ శివారు బొడ్డువానిలంక రహదారికి మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ తొలగిపోనున్నాయి. రూ.1.91 కోట్లతో నిర్మించనున్న ఈ రహదారికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్డువానిలంక, పాతకోరంగి వాసుల చిరకాల వాంఛ త్వరలోనే నెరవేరనుందన్నారు. ఈ ప్రాంత అక్కచెల్లెమ్మలు తాగునీరు కావాలని అడిగారని, అలాగే అన్నదమ్ములు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారన్నారు. ఇప్పటికే ఓఎన్‌జీసీ నిధులతో వాటర్ ట్యాంకు నిర్మించామని, రాబోయే 10 రోజుల్లోనే ప్రారంభించి తాగునీరు అందిస్తామన్నారు. అలాగే బొడ్డువానిలంక- పాతకోరంగి రహదారి రూ.1.91 కోట్లతో పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టి మే నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. అనంతరం సీతారామపురం యాదవపేటలో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నేతలు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణం.. మాయాజాలం

- డ్వాక్రా రుణాల చెల్లింపుల్లో అవకతవకలు
- కొందరి చేతివాటంతో లబోదిబోమంటున్న సభ్యులు



కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయం

కాట్రేనికోన: పర్యవేక్షణ లేకుంటే.. పట్టించుకునే వారూ కానరాకుంటే ఇలానే ఉంటుంది. డ్వాక్రా సంఘాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక కొందరు యానిమేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య పరిధిలోని కొన్ని సంఘాల అధ్యక్షులు, యానిమేటర్లు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు నిజమవుతున్నాయి. కాట్రేనికోన గ్రామ సంఘ పరిధిలోని శిరీషా మహిళా సంఘం ఏడాది కిందట యూనియన్ బ్యాంకు నుంచి రూ.7.50 లక్షల రుణం తీసుకుంది. సభ్యులు చెల్లించాల్సిన అప్పును ప్రతి నెలా సంఘం ప్రెసిడెంట్ ద్వారా బ్యాంకు ఖాతాలో జమ చెయ్యాలని యానిమేటర్‌కు ఇస్తున్నారు. అయితే యానిమేటర్ తీరుపై అనుమానం వచ్చిన సంఘ సభ్యులు ఇటీవల బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకున్నారు. బ్యాంకు రుణం, ప్రతి నెలా జమ చేసిన పొదుపు, అప్పు బాపతు నగదు జమలను లెక్క చూసుకున్నారు. సుమారు రూ.లక్ష వరకూ బ్యాంకులో కట్టలేదని గుర్తించినట్లు ఆ సంఘ సభ్యులు తెలిపారు. దీనిపై యానిమేటర్‌ను నిలదీశారు. నగదు విషయంలో యానిమేటర్‌కు పంపిన సొమ్ముపై ప్రతి నెలా వాయిస్ రికార్డులు ఉండటంతో తప్పు చేసినట్లు ఆమె ఒప్పుకుందన్నారు. యానిమేటర్ తీరుపై ఏపీఎం వెంకటేశ్వరరావు దృష్టికి సభ్యులు తీసుకువెళ్లడంతో రూ.49 వేలు జమ చేసిందని, మిగిలిన సొమ్ము రెండు రోజుల్లో జమ చేస్తానని చెప్పిందన్నారు.

మరి కొన్నిచోట్లా ఇలా..

కాట్రేనికోన అడవిపేటలో ఓ గ్రూపు సభ్యులు బ్యాంకు నుంచి రూ.3 లక్షల రుణం తీసుకున్నారు. ప్రతి నెలా బ్యాంకుకు సొమ్ము కట్టేందుకు డ్వాక్రా ప్రెసిడెంట్‌కు ఇచ్చేవారు. కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్లగా రూ.2 లక్షలు అప్పు కట్టాల్సి ఉందని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యారు. బ్యాంకుకు చెల్లించకుండా గ్రూపు ప్రెసిడెంట్ వాడుకుందనే ఆరోపణలు వచ్చాయి. పల్లంకుర్రు బట్టు చెరువులో ఓ సంఘ సభ్యులు బ్యాంకు రుణం తీసుకుని రూ.50 వేల చొప్పున 11 మంది పంచుకున్నారు. బ్యాంకు డిపాజిట్ రూ.50 వేలు పోను మిగిలిన రూ.లక్ష సభ్యులకు తెలియకుండా యానిమేటర్ సహకారంతో ప్రెసిడెంట్ స్వాహా చేశారని ఆరోపణ. వెంకమ్మ చెరువులో రెండేళ్ల కిందట రూ.40 వేల చొప్పున రుణం తీసుకుని అధ్యక్షురాలికి చెల్లించగా బ్యాంకుకు చెల్లించకుండా సుమారు రూ.2 లక్షలు స్వాహా చేసిందని సభ్యులు ఆరోపించారు. ఉప్పూడిలో రుణం తీసుకున్న సొమ్ము సభ్యులు తిరిగి చెల్లించినా అధ్యక్షురాలు బ్యాంకు చెల్లించక పోవడంతో కొత్త రుణం మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏపీఎం వెంకటేశ్వరరావును వివరణ కోరగా శిరీషా మహిళా సభ్యులు ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో ఆ యానిమేటర్ రూ.49 వేలు జమ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆమె పరిధిలోని అన్ని గ్రూపులను దర్యాప్తు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన గ్రూపులకు సంబంధించి ఫిర్యాదులు వస్తే తగిన దర్యాప్తు చేస్తామన్నారు.

అధికారులు ఎక్కడ..?



ఉప్పలగుప్తం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి



అల్లవరం సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

- సమావేశానికి రాకుంటే ఎలా
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ఉప్పలగుప్తం: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమావేశాలకు అధికారులు రాకుంటే ఎలా.. ఈ విధానం సరికాదంటూ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. దీనికి మండలంలో 21 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే వచ్చారు. ఇందులో నాలుగు శాఖలకు సంబంధించి మండల స్థాయి అధికారులు హాజరు కాగా మిగతా వారంతా కింద స్థాయి ఉద్యోగులే. ఈ విషయమై జెడ్పీటీసీ గెడ్డం సంపదరావుతో పాటు పాలకపక్షానికి చెందిన పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రాకుంటే సమస్యలను ఎవరితో చర్చించాలని ఎంపీడీవో గౌరీకుమారిని అడిగారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో గ్రామస్థాయి సమస్యలు చర్చించుకోవాల్సిన వేదికే సర్వసభ్య సమావేశమని అన్నారు. విలసవిల్లి సర్పంచ్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సరిపల్లిలో కొన్నిచోట్ల కుళాయిల నుంచి మురుగు వస్తుందని ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు తెలిపారు. ఎస్.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు మాట్లాడుతూ తమ గ్రామంలోని పంట కాలువలో ఉప్పునీరు ప్రవహిస్తుందని, సాగుకు, పశువుల దాహార్తికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న జనరిక్ మందుల షాపును ఉప్పలగుప్తం, గొల్లవిల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్య కోరారు. కోతల సమయాల్లో ఉపాధి పనులు నిర్వహించరాదని గొల్లవిల్లి సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు అన్నారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు పెట్టా అప్పారావు, మండల ఆర్‌బీకే చైర్మన్ మానే శ్రీను పాల్గొన్నారు.

అల్లవరం మండల పరిషత్తులో..

అల్లవరం: మండలంలో 1,364 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకంలో రూ. 11.46 కోట్ల నిధులు విడుదల అయ్యాయని ఎంపీడీఓ జి.సరోవరరావు తెలిపారు. లబ్ధిదారులకు ఏప్రిల్ 4న మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా జమ చేస్తామన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కోవిడ్ నిబంధనలు పాటించాలని గోడిలంక పీహెచ్‌సీ సిబ్బంది ప్రసాద్ తెలిపారు. హౌసింగ్ ఏఈ సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 23 జగనన్న లేఅవుట్‌లలో నూతన గృహ నిర్మాణాలు చేపడతామన్నారు. బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు నుంచి వస్తున్న తాగునీరు వాసన వస్తుందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి ఏపీఈపీడీసీఎల్ ఏఈ సూర్యనారాయణ హాజరు కాకపోవడంతో సభ్యులు మండిపడ్డారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు, తహసీల్దార్ ఎస్.సాంబశివప్రసాదు పాల్గొన్నారు.

అపోహలు నివృత్తి చేయాలి



చర్చా వేదికలో మాట్లాడుతున్న కోకోఫెడ్ చైర్మన్ బలరామమూర్తి

అమలాపురం టౌన్: కొత్తగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)పై ప్రజలకు ఉన్న అపోహలను అధికారులు నివృత్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో అముడాపై కోనసీమ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకోఫెడ్) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన చర్చా వేదికలో సత్తిబాబు మాట్లాడారు. కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ చర్చా వేదికలో పలు వ్యాపార, రియల్ ఎస్టేట్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిల్డర్లు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. ప్రజలకు నష్టం లేని విధంగా అముడా ఏర్పాట్లు చేయాలని పలువురు ఆకాంక్షించారు. కోకో ఫెడ్ సెక్రటరీ ఎస్.ఆదిత్యకిరణ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, వివిధ వర్గాలకు చెందిన మాకిరెడ్డి మనోజ్, ఎమ్మెస్వీ ప్రసాద్, వంటెద్దు బాబీ, మోకా వెంకట సుబ్బారావు, వలవల శివరావు, ట్రేడ్ యూనియన్ నాయకుడు కుసుమ సూర్య మోహనరావు, కోకోఫెడ్ అమలాపురం డివిజన్ అధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

అమలాపురం రూరల్: ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ సలహా మండలి చైర్‌పర్సన్ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం బండారులంక పీహెచ్‌సీలో ఆసుపత్రి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యురాలు స్వర్ణకమల మాట్లాడుతూ ఆసుపత్రి ప్రహరీ కూలిపోయిందని, కొత్తది నిర్మించాలని కోరారు. త్వరలో ఓఎన్జీసీ నిధులతో నిర్మిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ కోరారు. ఎంపీడీవో కాశీ విజయప్రసాద్, వైద్యాధికారి వాసునాయక్, ఎంపీడీవో కాశీ విజయప్రసాద్, సర్పంచులు పెనుమాల సునీత, పందిరి విజయ, ఎంపీటీసీ సభ్యురాలు అంకం భారతి, దంగేటి బుల్లబ్బులు పాల్గొన్నారు.

రూ.139 కోట్లతో ప్రతిపాదనలు

యానాం: యానాం నియోజకవర్గంలో వరద నియంత్రణ గట్టు నిర్మాణానికి రూ.139 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వరద రక్షణ ఏటి గట్టు నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి లక్ష్మీనారాయణ స్పందిస్తూ గత ఏడాది జూలైలో భారీ వరదలు వచ్చిన నేపథ్యంలో పలు ప్రాంతాలు తీవ్రంగా ముంపునకు గురయ్యాయన్నారు. దీంతో ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ స్పందించి అదే నెల 19న యానాంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారన్నారు. అప్పుడే రక్షణ గట్టుకు నిధులు మంజూరు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, అవి మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూడబ్ల్యూఏ ప్రతినిధులు

తాళ్లరేవు: తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో దళిత యువకుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.పోతురాజుకు వినతిపత్రం అందజేసింది. తాళ్లరేవు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ తదితరులు వినతిపత్రం అందించి మాట్లాడారు. రాము హత్యకు గురికాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

అలరించిన అందెల సవ్వడి



నృత్యం చేస్తున్న చిన్నారులు

అమలాపురం రూరల్: నృత్య ప్రదర్శన అలరించింది.. మన సంస్కృతిని ప్రతిబింబించింది.. అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏర్పాటైన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. నల్లా హైమావతి బృందంచే దత్తసాయి చిన్నారుల కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. కల్యాణ వేంకటేశ్వస్వామి కోలాట భజన మండలి వారిచే కోలాటం జరిగింది. బృంద సభ్యులను ఆలయ చైర్‌పర్సన్ దూడల వీరీతాదేవి ఫణి దంపతులు, ఈఓ సాయిబాబా సత్కరించారు.

ఆలోచింపజేసిన స్వీకారం నాటిక



కళాకారులను సేవా పురస్కారాలతో సత్కరిస్తున్న రసవాహిని ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం సాంస్కృతిక కళావేదిక రస వాహిని సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ హాలులో గురువారం రాత్రి వేడుకలు జరిగాయి. ఈ వేదికపై ప్రదర్శించిన 'స్వీకారం' నాటిక అందరినీ ఆలోచింపజేసింది. కొడుకును అల్లారు ముద్దుగా పెంచి ప్రయోజకుడిని చేసి అమెరికాలో ఉన్నత ఉద్యోగం చేసే స్థాయి చేర్చిన కన్న తండ్రి రాజారాం చివరకు కోడలి విషయంలో తనకు తాను ఇచ్చుకున్న తీర్పు రెక్కలు వచ్చాక అయిన వాళ్ల మాటను పట్టించుకోని కొడుకులకు కనువిప్పు అయింది. కొడుకు మహదేవ్ అమెరికాలో ఉన్నత ఉద్యోగంతో స్థిరపడతాడు. కొడుక్కి తన స్నేహితుడి కుమార్తె స్వర్ణసీతను ఇచ్చి పెళ్లి చేసి ఆ కొత్త జంటను అమెరికా దేశానికి సాగనంపుతాడు తండ్రి. ఆ దేశంలో మహదేవ్‌కు వేరే అమ్మాయితో సంబంధం ఉండి భార్య స్వర్ణసీతను మీ వాళ్లను చూసి వద్దువు గాని అంటూ సొంతూరుకు పంపించేస్తాడు. తర్వాత భార్య, తండ్రి ఫోన్లు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతాడు. చివరకు భార్య స్వర్ణసీతకు విడాకుల నోటీసు పంపుతాడు. ఇదేంటని తండ్రి నిలదీస్తాడు. ఇది మామూలే, అమెరికాలో చాలా కామన్ అంటే తేలిగ్గా భార్యను వదిలేస్తాడు. చివరకు తండ్రి రాజారాం కోడలికి అండగా నిలిస్తాడు. కొడుకుకు ఆమెతో విడాకులు ఇప్పించి తర్వాత కోడలిని తన కూతురుగా దత్తత తీసుకుంటాడు. తన ఆస్తి మొత్తాన్ని స్వర్ణసీత పేరున రాస్తాడు. ఆ కొడుకును బయటకు గెంటేయడంతో ఈ కథ కంచికి చేరుతుంది. రసవాహిని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రంగస్థల నటుడు మహ్మద్ షెహన్ షా నటన, దర్శకత్వంలో ఈ నాటిక ప్రదర్శితమైంది. రావి నాగేశ్వరరావు రచించిన ఈ నాటికలో నటీనటులు తమ పాత్రలకు న్యాయం చేశారు. తొలుత రస వాహిని వార్షికోత్సవ సభలో అమలాపురం శ్రీచెన్నమల్లేశ్వర కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నల్లా సత్యనారాయణ పేరుతో ముగ్గురి రంగస్థల కళాకారులకు రంగ స్థల సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. డోగపర్తి శంకరరావు (విజయవాడ), కొండాబత్తుల నరసింహమూర్తి (అమలాపురం), పీసీహెచ్ నాయుడు (అనకాపల్లి)లను సేవా పురస్కారాలతో సత్కరించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ డాక్టర్ గోదశి గంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, యోగా గురువు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సభా స్థలం పరిశీలన

ఐ.పోలవరం: మురమళ్లలో ఈ నెల 6న జరుగనున్న వైఎస్సార్ ఆసరా నిధుల జమ కార్యక్రమానికి సంబంధించిన సభా స్థలాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ట్రాఫిక్‌కు, లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాలె రాజబాబు, సొసైటీ అధ్యక్షుడు సుంకర నాగబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి మోకా రవికుమార్, ఎంపీటీసీ మట్టపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో అన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం భక్తులు విరాళాలు సమర్పించారు. దాత సత్తి రాజ్యలక్ష్మి రూ.50 వేలు, చలపతి సత్యవాసు రూ.10,116లను ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి

యానాం: సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకం కావాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్-2023ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ యువకులు సమాజ సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ వేలాయుధన్, హెచ్ఓడీ వీవీఎల్‌పీ రాజు, ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జయవీరన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఉప్పలగుప్తం: ఏప్రియల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరమణ అన్నారు. మునిపల్లి, చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అతని స్నేహితుడు నూకల ఈశ్వర వెంకటప్రసాద్‌తో కలసి శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

నేడు మహిళా మార్ట్ ప్రారంభం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బాలయోగి కల్యాణ మండపంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని శుక్రవారం వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం రెడ్డి సన్యాసిరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మహిళా మార్ట్‌ను ప్రారంభించిన అనంతరం కోరంగి సచివాలయం-2 వెనుక ఉన్న లేఅవుట్‌లో వైఎస్సార్ ఆసరా 3వ విడత మహిళా సంఘ సభ్యులకు చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు.

సిబ్బందికి జీతాలు విడుదల

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 7 నెలల జీతాలకు సంబంధించి రూ.15 లక్షలు విడుదలయ్యాయి. ఈ విషయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకున్న సంబంధిత ది యానాం మల్టీపర్పస్ సర్వీస్ ప్రొవైడర్స్ సంస్థకు ఈ మొత్తం మంజూరైందన్నారు. ఇటీవల జీజీహెచ్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల గురించి అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. అదేవిధంగా సిబ్బందికి ఈఎస్ఐ, ఈపీఎఫ్, జీఎస్టీ తదితర వాటిని ప్రతి నెలా చెల్లించాల్సి ఉంటుందని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ మౌలిక వసతులు, తాగునీటి లభ్యత, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. దాతలు ఇచ్చిన నిధుల వినియోగాన్ని తెలుసుకున్నారు. డీఎస్పీ పి.ముత్యాలనాయుడు, సీఐలు సత్యకిశోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బోడసకుర్రు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రాణాలు తీసుకోవద్దు.. ప్లీజ్

అల్లవరం: బోడసకుర్రు- పాశర్లపూడి గ్రామాల మధ్య వైనతేయ నదిపై నిర్మించిన బ్రిడ్జి డెత్ స్పాట్‌గా మారింది. ఇక్కడ అనేక మంది ఆత్మహత్యా యత్నాలకు పాల్పడుతున్నాయి. భార్యభర్తల మధ్య తగాదాలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, ప్రేమ వివాహాలు తదితరాలే దీనికి కారణం. ఇక్కడ ఈ ఘటనలను నిలువరించేందుకు తాటిపాకకు చెందిన స్వర్ణాంధ్రమూర్తి చారిటబుల్ ట్రస్టు నడుం బిగించింది. ఆత్మహత్యా యత్నానికి వచ్చిన వ్యక్తికి జీవితంపై ఆశ కల్పించే విధంగా బ్రిడ్జి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. 'ఒక్క నిమిషం ఆగండి' మీ జీవితం మీది కాదు, మీ కుటుంబానిది. ఒక్క నిమిషం మీ కుటుంబం, బంధువులు, స్నేహితులను గుర్తుచేసుకుని వారితో మీకు ఉన్న అనుబంధాన్ని తెలుసుకోండి. మీ సమస్య చావు కంటే ప్రమాదకరమైనది కాదు అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జీవితంపై ఆశ కల్పించే విధంగా స్వర్ణాంధ్రమూర్తి చారిటబుల్ ట్రస్టు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.